క్లుప్తంగా

తాగునీరు సరఫరా కోసం ఆందోళన



రేపల్లె రూరల్: తాగునీరు అందడం లేదని పట్టణంలోని 28వ వార్డుకు చెందిన స్థానికులు బుధవారం రేపల్లె–పేటేరు రహదారిపై బైఠాయించి నిరసన తెలియజేశారు. గత ఆరు రోజుల నుంచి మున్సిపల్ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా కాకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకోవటంతో సమాచారం తెలుసుకున్న ఎస్ఐ హరిబాబు, మున్సిపల్ కమిషనర్ విజయసారథిలు సంఘటనా స్థలానికి చేరుకుని వార్డు నివాసులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. పలు ప్రాంతాలలో లైన్ల మరమ్మతుల వలన నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడిందని గురువారం నుంచి పూర్తిస్థాయిలో నీటి సరఫరా చేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనులపై నివేదికలు

పిట్టలవానిపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశాన్ని ఎంపీపీ షేక్ బాజి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి పంచాయతీరాజ్ ఏఈ ప్రసన్నకుమార్ వివరించారు.అధిక శాతం గ్రామాలలో గ్రామ సచివాలయాలు,హెల్త్ క్లినిక్‌లు నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు.గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు వివరించారు.పలు శాఖల అధికారులు నిర్వహిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, పలువురు ప్రజా ప్రతినిధులు, ఎంపీడీఓ శేషమాంబ, ఈఓపీఆర్డీ పద్మజ తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నూనె, సబ్బులు పంపిణీ



తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 8,9 పారిశుధ్య డివిజన్‌లలో పనిచేసే కార్మికులకు బుధవారం ప్రభుత్వం పంపిన సబ్బులు, నూనెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, శానిటరి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, అనుపమ పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి



మృతుడి బ్యాగులో ఉన్న ఫొటో

తెనాలిరూరల్: తెనాలి వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. భక్తులు గమనించి 108కు సమాచారం అందించగా వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి వైకుంఠపుర దేవస్థాన ఆవరణలో సుమారు 50–55 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన భక్తులు, ఆలయ సిబ్బంది 108కు సమాచారం అందించగా తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి పొద్దుపోయాక మృతి చెందాడు. వైద్యశాల సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వద్ద ఉన్న బ్యాగులో చిన్నారితో కూర్చున్న మహిళ ఫొటో ఉంది. వివరాలు తెలిసిన వారు 9440796218 నంబరులో సంప్రదించాలని పోలీసులు కోరారు.

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి

గుంటూరు రూరల్: ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మేడికొండూరు మండలం పేరేచర్లకు చెందిన ఇరగదల బ్రహ్మం(35) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఆటోనగర్ వైపు నుంచి బుధవారం సాయంత్రం చిల్లీస్ మీదుగా పేరేచర్లకు ట్రాక్టర్‌తో బయలుదేరాడు. ప్రమాదవశాత్తూ అదుపు తప్పి ఇన్నర్ రింగ్‌రోడ్డులో బోల్తా పడింది. ప్రమాదంలో బ్రహ్మం తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆడుదాం ఆంధ్రాకు ఉరకలెత్తిన ఉత్సాహం

- పోటీల్లో హోరాహోరీగా తలపడ్డ క్రీడాకారులు
- రేపల్లెలో పోటీలను ప్రారంభించిన ఆర్డీవో హేలా షారోన్



టాస్ వేస్తున్న మున్సిపల్ కమిషనర్ విజయసారథి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్డీవో హేలా షారోన్

రేపల్లె రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రారంభమైన ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. గెలుపొందిన జట్లకు ప్రభుత్వం నగదు బహుమతులు ప్రకటించిందన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలలో నియోజకవర్గ స్థాయిలో ప్రథమస్థానం పొందిన వారికి రూ. 35 వేలు, జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి రూ.60 వేలు, రాష్ట్ర స్థాయిలో రాణించిన వారికి రూ.5 లక్షలను అందిస్తుందన్నారు. అదేవిధంగా బ్యాడ్మింటన్ క్రీడకు నియోజకవర్గ స్థాయిలో రూ.20వేలు, జిల్లాస్థాయిలో రూ.35వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.2లక్షల నగదు ప్రోత్సాహకాలను అందించి ప్రోత్సహిస్తోందని తెలిపారు. క్రీడాకారులు తమ ప్రతిభను చాటి నియోజకవర్గానికి గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా తొలిరోజు జరిగిన వాలీబాల్, బాడ్మింటన్ పోటీలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, ఎంపీడీవో శివపార్వతి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖోలో రాణించిన బాలికలు

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం గ్రామానికి చెందిన బాలికలు ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా ఖోఖో క్రీడలో రాణించి బాపట్ల జిల్లా జట్టుకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కుంతం అనూష, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసన్నరాజు మాట్లాడుతూ బాలికా దినోత్సవం రోజున ఖాజీపాలెం గ్రామానికి చెందిన బాలికలు జిల్లా స్థాయి ఖోఖో క్రీడకు ఎంపిక కావటం సంతోషకరమన్నారు. క్రీడాకారులను అభినందించారు.



జిల్లా జట్టుకు ఎంపికైన ఖాజీపాలెం బాలికలు

నాడు–నేడు పనుల పురోగతిపై సమీక్ష



పనుల పురోగతిపై ఆరా తీస్తున్న డీఈవో

అమర్తలూరు(వేమూరు): నాడు–నేడు పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి చుండూరు, అమర్తలూరు, చెరుకుపల్లి, పిట్టలవాని పాలెం మండలాల ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాడు–నేడు పనుల ప్రగతి గురించి డీఈవో ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అంగన్ వాడీ కేంద్రాలకు కేటాయించిన నిధులు కూడా వినియోగించు కోవాలని ఆదేశాలు జారీ చేశారు. నాడు నేడు పనుల్లో అవకతవకలకు పాల్పడరాదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేయాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందన్నారు ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రబీ పంటలపై రైతులకు అవగాహన

చావలి(వేమూరు): రబీ సాగులోని పంటలపై సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని జిల్లా వనరుల కేంద్రం బాపట్ల వ్యవసాయాధికారి ఆర్ విజయబాబు తెలిపారు. వేమూరు మండలంలోని చావలి గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రస్తుతం సాగు చేసిన మినుము, మొక్కజొన్న,పెసర పంటలలో యాజమాన్య సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీహెచ్ సునీత, రైతులు పాల్గొన్నారు.

లేగ దూడల అందాల పోటీలకు స్పందన



పోటీల్లో మొదటి బహుమతి అందుకుంటున్న కృష్ణమాచార్యులు

యాజలి(కర్లపాలెం): లేగ దూడల ఎదుగుదలకు రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎం.హనుమంతరావు చెప్పారు. కర్లపాలెం మండలంలోని యాజలి గ్రామంలో బుధవారం పశు సంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో లేగదూడల అందాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో కాండూరి కృష్ణమాచార్యుల లేగదూడను మొదటి బహుమతికి, ఇక్కుర్తి మురళికి చెందిన లేగదూడకు ద్వితీయ బహుమతికి, ఇనుముల శ్రీనివాసరావుకు చెందిన లేగదూడకు తృతీయ బహుమతికి ఎంపికచేసి బహుమతులు అందజేశారు. ఈ పోటీలలో మొత్తం 40 లేగదూడలు పాల్గొనగా అన్ని దూడలకు సంబంధించిన రైతులకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. జిల్లా అధికారి హనుమంతరావు మాట్లాడుతూ లేగదూడలకు మూడు నెలల వరకు తల్లిపాలు సమృద్ధిగా తాగించాలని ఆ తరువాత గడ్డి, పోష్టిక విలువలు కలిగిన దాణా అలవాటు చేయాలని చెప్పారు. పశు సంవర్ధక శాఖ బాపట్ల డివిజన్ ఉప సంచాలకులు కేదారేశ్వరరావు మాట్లాడుతూ పాడి రైతులు మేలు జాతి పశువులను ఎంపిక చేసుకుని పోషక విలువలు కలిగిన దాణా పెట్టటం వలన పాల దిగుబడి అధికంగా వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వై.శంకర్‌రావు, పశువైద్యులు రేచల్ దివ్య, ఎం.మహేష్, కె.తిరుమలతేజ, వనజాక్షి, సిబ్బంది రాజేష్, పాండురంగారావు, రెహ్మతున్నీసా, నవీన్, గోపాల మిత్రలు శ్రీనివాసాచార్యులు, బత్తుల శ్రీను, నాగేశ్వర రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

బోడపాడు(వేమూరు): అమర్తలూరు మండలం బోడపాడు గ్రామానికి చెందిన దేవరకొండ లక్ష్మీ కాంతమ్మ(30) తెనాలి పోస్టు కార్యాలయంలో పోస్ట్ ఉమెన్‌గా పనిచేస్తోంది. చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామానికి చెందిన తన భర్త అలపర్తి సురేష్, అత్త మామల వేధింపులకు భరించలేక ఈ నెల 22 న సూసైడ్ నోట్ రాసి పురుగు మందు తాగింది. గమనించిన ఆమె తల్లి, తమ్ముడు వెంటనే పొన్నూరులోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకురాగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ బుధ వారం తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. లక్ష్మీకాంతమ్మ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలి భర్త అలపర్తి సురేష్ పరారీలో ఉన్నాడని చెప్పారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తులపై కేసులు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మ ద్యం తరలిస్తున్న ముగ్గురు వ్య క్తులపై కేసులు నమోదయ్యాయి. పట్ట ణ గంగానమ్మపేట గోపాలరెడ్డి వీధిలో కొత్తపేటకు చెందిన వ్యక్తి ఆరు సీసాలు తీసుకెళుతుండగా టూ టౌన్ పోలీసు ల తనిఖీ ల్లో పట్టుబడ్డాడు. అలానే మార్కెట్ ఏరియాలో వన్‌టౌన్ పోలీసులు ఓ వ్యకి వద్ద 20, మరో వ్యక్తి వద్ద 10 సీసాలను గుర్తించి స్వాధీనపర్చుకున్నారు. ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

క్రీడలతో వ్యక్తిత్వ వికాసం వృద్ధి

నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

కొల్లూరు : ప్రతి వ్యక్తి తన జీవితంలో ఎదురయ్యే సమస్యలపై పోరాడి విజయం సాధించడానికి ఆటల పోటీలు దోహదపడతాయని వేమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. బుధవారం కొల్లూరు బాలురోన్నత పాఠశాల క్రీడామైదానంలో వేమూరు నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రస్తుతం నెలకొని ఉన్న పోటీ తత్వాన్ని ఎదుర్కొని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య వంతమైన జీవనం గడపాలన్న తలంపుతో సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆటలను తమ జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత చేకూరడంతోపాటు, శారీరక ధారుఢ్యం పెరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారుల ప్రతిభా పాటవాలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు దోహదపడతాయన్నారు. తొలుత ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు బుల్లా నవరత్నం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ అయిల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు గంట శివరంగారావు, కూచిపూడి మోషే, నర్ర బుల్లి బాబు, ఆళ్లమూడి మధు, కమ్మెల సాంబశివ రావు, ఉప్పు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం మనవడి వేధింపులు

తెనాలిరూరల్: ఆస్తి రాసివ్వాలని అమ్మమ్మను మనవడు, అతనితో వివాహేతర సంబంధం ఉన్న మహిళ, ఆమె తరపువారు వేధింపులకు గురి చేస్తుండడంపై కేసులు నమోదయ్యాయి. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ గంగానమ్మపేటకు చెందిన సుబ్బలక్ష్మిని ఆమె మనవడు విజయభాస్కర్, అతనితో వివాహేతర సంబంధం ఉన్న మహిళ, ఆమె తరపు మరో ఐదుగురు ఆస్తి తమకు రాసివ్వాలని వేధింపులకు గురి చేస్తున్నారు. మద్యం తాగి వచ్చి మనవడు తరచూ వేధింపులకు గురి చేస్తుండడంతో సుబ్బలక్ష్మి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూ టౌన్ పోలీసులు బుధవారం తెలిపారు.

క్రీడలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక జీవన విధానంలో వ్యాయామానికి అంత ప్రాధాన్యత ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే క్రీడలపై యువత ఎక్కువ శ్రద్ధ చూపటం లేదన్నారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అలాగే క్రికెట్ ఆడి ఆటను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కమిషనర్ ఎం.జశ్వంతరావు, జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 22వ వార్డులో బుధవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే వార్డులో జరుగుతున్న మురుగు కాల్వల పూడికతీత పనులు పరిశీలించారు. ఆమె వెంట 22వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ షేక్ దుబాయ్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, పలువురు శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు ఉన్నారు.

భూహక్కు పత్రాలతో రైతాంగానికి మేలు

వేమూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి



భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న వరికూటి అశోక్‌బాబు

కొల్లూరు : రైతుల ఆధీనంలో ఉన్న వ్యవసాయ భూములకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భూహక్కు పత్రాలు మంజూరు చేయడం రైతాంగానికి ఎనలేని మేలు చేస్తుందని వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని చిలుమూరులంకలో ప్రభుత్వం మంజూరు చేసిన శాశ్వత భూహక్కు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తమ భూములలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులకు దశాబ్దాల తరబడి భూములపై ఎటువంటి హక్కులు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భూహక్కు పత్రాలు మంజూరు చేయడంతో రైతాంగానికి ఎంతో ప్రయోజనం చేకూరనున్నదన్నారు. గతంలో భూములపై వ్యవసాయ రుణాలు పొందడానికి, ప్రకృతి విపత్తుల ద్వారా పంట నష్టం ఏర్పడితే ప్రభుత్వం మంజూరు చేసే పంట నష్ట పరిహారం అందక రైతులు ఎంతో నష్టపోయేవారని అన్నారు. ప్రభుత్వం భూహక్కు పత్రాలు ఇవ్వడంతో ఆయా భూముల్లోని రైతులకు ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే అనేక పథకాలు అందడానికి అవకాశం ఏర్పడిందన్నారు. రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చొరవతో మంజూరైన శాశ్వత భూహక్కు పత్రాలను పంపిణీ చేయడం ద్వారా రైతాంగానికి మేలు చేయడం తనకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు సమస్యలను దృష్టిలో ఉంచుకొని పండిన పంటలకు మద్దతు ధర కల్పించడంతో పాటు, రైతు భరోసా, పంట రుణమాఫీ చేయడంతో రైతు పక్షపాత ప్రభుత్వంగా పేరు గడించిదన్నారు. కార్యక్రమంలో భాగంగా 89 మంది లబ్ధిదారులకు భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని తోకలవారిపాలెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వాగోలు శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సర్పంచ్‌లు తోట నరేష్, మేకతోటి శ్రీకాంత్, ఎంపీటీసీ సభ్యుడు సుగ్గున అశోక్, బుల్లా నవరత్నం, తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, ఈపూరు సొసైటీ బ్యాంక్ చైర్మన్ సూర్యదేవర రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ అయిల సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు లాజర్, ఉప్పు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న కోట వెంకటేశ్వరరెడ్డి

బాపట్ల అర్బన్ : భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యాలైన ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సామ్యవాద భావనలు రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ఊరూరా జన విజ్ఞానం కార్యక్రమంలో భాగంగా జన విజ్ఞాన వేదిక ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం బాపట్లలోని ఎస్ఎంజీ హైస్కూల్ ఆవరణలో జరిగిన రాజ్యాంగ పీఠిక అవగాహన కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయురాలు టి.రమాదేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగంలోని మౌలిక లక్షణాలు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, లౌకికవాద భావనలు, సామ్యవాద సమాజ విశిష్టతను తప్పక తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత

చైల్డ్ అడ్వకసీ ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీనివాసరావు



వాల్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

రేపల్లె రూరల్: బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీనివాసరావు చెప్పారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని తుమ్మల, పోటుమెరక, చోడాయపాలెం, నల్లూరు పాలెం, కారుమూరు గ్రామాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రోజు రోజుకు పురుషుల కంటే బాలికల నిష్పత్తి గణనీయంగా తగ్గిపోతుందన్నారు. ప్రతి వెయ్యి మంది పురుషులకు 943 మంది మాత్రమే స్త్రీలు ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయన్నారు. చిన్ననాటి నుంచే బాలికలపై వివక్ష పెరగటంతో బాలికల సంఖ్య తగ్గిపోతుందన్నారు. బాల్య వివాహాలు నిర్వహించటం, భ్రూణ హత్యలను అరికట్టటంతో బాలికల సంఖ్య పెంచవచ్చన్నారు. దీంతో పాటు బాలికలు తమ హక్కులను తెలియజేయాలన్నారు. అనంతరం బాలికల హక్కులు తెలియజేసే వాల్ పోస్టర్‌లను విడుదల చేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్‌లు ప్రసన్నలక్ష్మి, నళిని, రత్న, ఆయా గ్రామాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న ప్రకటనపై హర్షం

తెనాలి: వెనుకబడిన తరగతుల సామాజిక అభ్యున్నతికి ఎనలేని కృషిచేసిన బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారం భారతరత్నను ప్రకటించటం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. బిహార్ ముఖ్యమంత్రిగా రెండు పర్యాయాలు చేసిన కర్పూరీ ఠాకూర్ శతజయంతిని పురస్కరించుకున్న అత్యున్నత గౌరవం కల్పించటాన్ని స్వాగతిస్తున్నట్టు బుధవారం తెనాలిలో చెప్పారు. మూడున్నర దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఓటమి ఎరుగని రాజకీయ నేతగా, మంగేరీలాల్ కమిషన్ సిఫార్సు మేరకు ఓబీసీలకు 26 శాతం రిజర్వేషన్ అమలుచేసిన ఘనుడని చెప్పారు. ఓబీసీల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి, 1990లో మండల కమిషన్ సిఫార్సుల అమలుకు దోహదపడిందన్నారు. దేశంలోనే తొలిసారిగా కులగణనను నిర్వహించి, సార్వత్రిక ఎన్నికలకు ముందు సవాల్ విసిరిన బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌ను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేసిందని భావిస్తున్నట్టు చెప్పారు. రాజకీయ ఎత్తుగడ అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి స్వచ్ఛందంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్‌బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కాకుమాను: రైతు భరోసా కేంద్రాల్లో అందిస్తున్న సదుపాయాలు, పథకాల్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రం–2లో బుధవారం వ్యవసాయ సలహా మండల సమా వేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివరామకృష్ణ మాట్లాడుతూ గ్రామస్థాయిలోనే రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను సకాలంలో అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి గ్రామంలో ఎన్నో కోట్లు ఖర్చు చేసి రైతు భరోసా కేంద్రాల్ని నిర్మించారని తెలిపారు. పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంట వివరాలను రైతులు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి కిసాన్ సన్మాన్ నిధికి అర్హులైన రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆమె తెలిపారు.వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు కొత్త అమేష్, ఏవో కె.కిరణ్మయి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

